ఎదురుచూపులు ఇంకెన్నాళ్లు..?



ప్రారంభానికి నోచుకోని శీలంవారిపల్లె జెడ్పీహెచ్ఎస్ హాస్టల్ భవనం



గ్రామంలోని బీసీ బాలికల వసతి గృహం

- పేద విద్యార్థినులకు అందని ద్రాక్షలా కేజీబీవీ టైప్–4 హాస్టల్
- హాస్టల్ లేక విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థినులు
- విద్యార్థినుల గోడుపట్టని పాలకులు, అధికారులు

సీఎస్‌పురం(పామూరు):

కూటమి ప్రభుత్వం విద్యా రంగంపై అలివిమాలిన నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఇప్పటికే గత ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు పాఠశాలల అభివృద్ధిని గాలికొదిలేసిన ప్రభుత్వం..గతంలో అన్ని పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా వాటిని పట్టించుకోవడం లేదు. ఫలితంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పూర్తయినా..ప్రారంభించరా..?

మండలంలోని శీలంవారిపల్లె జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలప్లస్ హైస్కూల్ విద్యార్థినుల వసతి కోసం అదే ప్రాంగణంలో 2019లో హాస్టల్ భవనం నిర్మించేందుకు శంకుస్థాపనచేశారు. ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హాస్టల్ భవన నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేసింది. అదేవిధంగా వార్డెన్, పార్ట్‌టైం టీచర్, హెడ్‌కుక్, అసిస్టెంట్‌కుక్, చౌకీదార్‌పోస్టులను మంజూరు చేయగా ఎన్నికల కోడ్‌రావడంతో హాస్టల్ భవన ప్రారంభం నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా హాస్టల్ భనాన్ని ప్రారంభించకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. హాస్టల్‌లో ఉండి చదువుకుందామనుకుంటున్న విద్యార్థుల ఆశలు అడియాశలుగా మారుతున్నాయి. ప్రభుత్వం నియమించిన హెడ్‌కుక్, అసిస్టెంట్‌కుక్, చౌకీదార్ ముగ్గురు అందుబాటులో ఉండగా వార్డెన్, పార్ట్‌టైం టీచర్ కింద నియమితులైన ఇద్దరు వేరే ఉద్యోగాలకు వెళ్లిపోవడంతో వారికి బదులుగా వేరేవారిని నియమించాల్సి ఉండటం, ఈప్రక్రియ జేసీతో ముడిపడి ఉండటంతో హాస్టల్ ప్రారంభం మరింత ఆలస్యమవుతోంది. తక్షణం వార్డెన్, పార్ట్‌టైం టీచర్‌ను నియమించి హాస్టర్ ప్రారంభించాలని విద్యార్థులు, తల్లిండ్రులు కోరుతున్నారు.

పాఠశాలలో 222 పైగా విద్యార్థులు

పాఠశాలలో మెరుగైన విద్యాబోధన, ప్రత్యేక తరగతులు, ఎన్ఎంఎస్‌కు శిక్షణ ఇస్తుండటం, క్యాంపెయినింగ్ నిర్వహించడంతో ఈపాఠశాలలో విద్యార్థులు అధికసంఖ్యలో చేరుతున్నారు. పాఠశాల ప్లస్‌టూలో ప్రస్తుతం 1 నుండి 10వ తరగతి వరకు 150 మంది విద్యార్థులు ఉన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియెట్‌లో 72 మంది విద్యార్థినులు ఉండగా వారికి వసతి గృహం లేకపోవడంతో ఇబ్బందులు పడుతుండగా మానవతా దృక్పథంతో మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు తన వ్యవసాయ, ఉద్యానవన కళాశాల ప్రాంగణంలో వారికి ఉచితంగా వసతి కల్పించి అక్కడే అల్పాహారం, భోజనం అందిస్తున్నారు. అదేవిధంగా 3 నుంచి 10 తరగతి వరకు చదువుతున్న సుమారు 70 మంది విద్యార్థినులు గ్రామంలో ఉండే బీసీ బాలికల వసతి గృహంలో ఉండి చాలీచాలని వసతుల మధ్య ఇక్కట్లు పడుతున్నారు.

హాస్టల్‌ను త్వరితగతిన ప్రారంభించాలి:



హాస్టర్ భవనం పూర్తయి చాలా కాలమైంది. తక్షణం వార్డెన్, పార్ట్‌టైం టీచర్‌ను నియమించి హాస్టల్ ప్రారంభించాలి. చాలా దూరం గ్రామాలనుండి వచ్చి చదువుకుంటున్నాం. ప్రస్తుతం దాతలు వసతి, భోజనవసతి కల్పించి ఆదుకుంటున్నారు.

బండారు మేఘన, ఎంపీసీ ఫస్ట్ ఇయర్

మెరుగైన ఫలితాలు వస్తున్నాయని చేరాం:



పాఠశాలలో ఉపాధ్యాయులు కృషితో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. డీజీపేటలో పాఠశాల ఉన్నా ఇక్కడ పాఠశాలలో చేరాం. హాస్టల్ ప్రారంభిస్తే చదువుకునేందుకు సులువుగా ఉంటుంది. నిత్యం పాఠశాల నుంచి సమీపంలోని దాతలు చూపిన వసతి గృహానికి వెళ్లాల్సి వస్తోంది. తక్షణం హాస్టల్ ప్రారంభించాలి.

కె.సోను, బైపీసీ ఫస్ట్ ఇయర్

ఏడాదిగా ఎదురుచూస్తున్నాం:



నూతన హాస్టల్‌లో ఉండి చదువుకోవాలని ఏడాదిగా ఎదురుచూస్తున్నా. ఈ ఏడాదైనా హాస్టల్‌ను ప్రారంభిస్తే అక్కడే ఉండి చదువుకుంటాం. ఇక్కడ హాస్టల్ ప్రారంభిస్తే 100 మంది ఉండేందుకు అవకాశం కలుగుతుంది. మరికొంతమంది గ్రామంలోని బీసీ హాస్టల్‌లో ఉండేందుకు అవకాశం వచ్చి సమస్య పరిష్కారమవుతుంది.

కె.శ్రావణి, ఎంపీసీ సెకండ్ ఇయర్

త్వరలో వార్డున్‌ను నియమించి హాస్టల్‌ను ప్రారంభిస్తాం:

వార్డెన్ నియామకానికి సంబంధిన ఫైల్ జేసీ వద్ద ఉంది. ఇటీవల రాష్ట్ర ప్రజాప్రతినిధఉల పర్యటన నేపద్యంలో జేసీ బిజీగా ఉండటంతో కొంచం ఆలస్యమైంది. త్వరలో వార్డెన్, టీచర్‌ను నియమిస్తాం. హాస్టల్‌లో చేరే విద్యార్థినులకు బెడ్స్‌కూడా తెప్పించి త్వరలో అన్ని వసతులతో హాస్టల్ ప్రారంభించి విద్యార్థుల ఇక్కట్లు తొలగిస్తాం.

కె.హేమలత, జీసీడీఓ

క్లుప్తంగా

అన్నప్రసాదానికి విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న దాత ఇందిరాదత్తు

పామూరు: స్థానిక పామూరు దేవాలయవీధి పోస్టాఫీసు వద్ద ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో ఈనెల 10వ తేదీ గురుపౌర్ణమి సందర్భంగా అన్న ప్రసాదంకోసం కేసీపీ సిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి వి.ఎల్. ఇందిరాదత్తు రు.2 లక్షల విరాళం ప్రకటించారు. విరాళం చెక్కును సాయిబాబా ఆలయ చైర్మన్ పబ్బతి వెంకట సుబ్బయ్యకు అందజేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సింగరాయకొండ: దోమకాటుకు గురికాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య విస్తరణాధికారి సీహెచ్‌వీ కళ్యాణి అన్నారు. మండలంలోని బింగినపల్లి ఎస్టీ కాలనీలో శనివారం మలేరియా మాసోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ర్యాలీ నిర్వహించి దోమలు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు కేశవరపు జాలిరెడ్డి, బీసాబత్తిన శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



రోడ్డుపై క్షతగాత్రుడు

టంగుటూరు: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కందులూరు సమీపంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కందులూరు ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రామారావు విధులు ముగించుకొని ఒంగోలు వెళ్తున్నాడు. కందులూరుకు చెందిన స్వాములు ఎదురెదురుగా తన బైకుతో ఢీకొనగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను చికిత్స కోసం 108లో రిమ్స్‌కు తరలించారు.

సమ్మెను జయప్రదం చేయండి



సమ్మె ప్రచార పత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పామూరు: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 09న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు సయ్యద్ మౌలాలి, వజ్రాల సుబ్బారావు, సీపీఐ మండల కార్యదర్శి పి.ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంవద్ద శనివారం సమ్మె ప్రచార పత్రాలను వారు ఆవిష్కరించారు. నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ అప్రెంటీస్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో కనీసవేతనం రూ.26 వేలుగా అమలుచేయాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీసమద్దతు ధర చట్టం తేవాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పట్టణాల్లో కూడా అమలుచేసి 200 పనిదినాలు కల్పించాలన్నారు. పాలపర్తి మస్తాన్‌రావు, ప్రసాద్, రాగిపాటి సూరిబాబు, పేరం రఘునాథరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

అన్ని గ్రేడ్‌లు కొనుగోలు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న ఆర్ఎం శీలం రామారావు

కొండపి: పొగాకు కంపెనీ ప్రతినిధులు వేలం కేంద్రానికి వచ్చిన అన్ని పొగాకు గ్రేడులను కొనుగోలు చేయాలని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ శీలం రామారావు అన్నారు. శనివారం స్థానిక పొగాకు వేలం కేంద్రంలో జరుగుతున్న వేలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం రైతుల సమస్యలు తెలుసుకుని వ్యాపారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ రామారావు రైతులతో మాట్లాడుతూ రైతులంతా మండెల్లో మగ్గిన పొగాకును బేళ్లు కట్టుకొని అమ్మకానికి తీసుకు రావాలని తెలిపారు. మార్కెట్‌కు అనుగుణంగా బేళ్లు తీసుకొని రావాలని సూచించారు. బేళ్లు అమ్మకానికి తెచ్చేటప్పుడు తేమ, వేడి లాంటివి లేకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మార్కెట్ దష్బ్యా తెలపరి పొగాకు, నీళ్ల కట్టిన పొగాకును తీసుకురావద్దని స్పష్టం చేశారు. కొన్ని కంపెనీ వాళ్ల కొనుగోలు చేసిన బేళ్లలో అన్య పదార్థాలు ఉన్నందున కస్టమర్స్ వాటిని తిరస్కరించారని తెలిపారు. రైతులందరూ తమ బేళ్లలో ఎటువంటి పొగాకేతర పదార్థాలు లేకుండా చూసుకోవాలన్నారు. కంపెనీ కొనుగోలుదారులకు అన్ని రకాల గ్రేడ్ పొగాకును కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. వేలానికి వచ్చే ప్రతి బేలును కొనుగోలు చేసి నోబిడ్ లేకుండా చూడాలని పేర్కొన్నారు. రైతుకు గిట్టుబాటు అయ్యే విధంగా పొగాకును కొనుగోలు చేయాలని సూచించారు. పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



రేషన్ దుకాణాన్ని తనిఖీచేస్తున్న విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ ఎ.కుమార్

పామూరు: రేషన్ దుకాణం నిర్వహణలో రేషన్‌డీలర్లు విధిగా సమయపాలన పాటించాలని విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ ఎ.కుమార్ అన్నారు. పామూరుతోపాటు మండలంలోని పలు గ్రామాల్లోని రేషన్ దుకాణాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టాక్‌ను రికార్డులతో సరిపోల్చారు. రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రేషన్ డీలర్లను హెచ్చరించారు. ఆయన వెంట వీఆర్ఓలు మనోజ్, శ్రీను ఉన్నారు.

నేడు సామూహిక సత్యనారాయణ వ్రతాలు

పామూరు: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పామూరు శ్రీరమాసమేత వీర వెంకట సత్యనారాయణస్వామి ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. వ్రతాల్లో పాల్గొన దలచినవారు పేర్లను నమోదుచేసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలి

కొండపి: అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేశారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ పెండింగ్ కేసుల్లో విచారణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీ పడకూడదని, చెడు నడత కలిగిన వారిపై ప్రత్యేకంగా కొనసాగించాలన్నారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, కొండపి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నూతన కమిటీల నియామకం

కనిగిరిరూరల్/పీసీపల్లి: వైఎస్సార్ సీపీ కనిగిరి, వెలిగండ్ల, పీసీపల్లి మూడు మండలాల నూతన కమిటీలను నియమించారు. కనిగిరి మండల ఉపాధ్యక్షులుగా గుంటూరి వెంకటేశ్వర్లు, ముద్దా బాబు, జనరల్ సెక్రటరీలుగా రామిరెడ్డి సుబ్బారెడ్డి, లక్ష్మీరెడ్డి తిరుపతిరెడ్డి, పట్నం దేవసాయం, సంగు వెంకటేశ్వరరెడ్డి, సెక్రటరీలుగా మన్నేపల్లి పేతూరు, పి.బాల మాలకొండయ్య, మితికల తిరుపతయ్య, అల్లాటిపల్లి ప్రసాద్, మల్లేల యాకోబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పి.ఆదాం, అంబటి వీరనాగయ్య, మేడం రమణారెడ్డి, దేవశీల వెంకట రామిరెడ్డి, శెట్టిపల్లి కొండయ్య, ఆలూరి పద్మావతి, వీరంరెడ్డి లక్ష్మీరెడ్డి, ఏ వెంకటరెడ్డి, మారం వెంకటేశ్వర్లు, పి.చిన్న గురవయ్య, ఎల్ రామిరెడ్డి, గంగిరెడ్డి నరసింహ, బాలుకోటిరెడ్డి, బి.చిన్న వెంకటేశ్వర్లు, నేలటూరి రమేష్, పాలూరి బుజ్జి, ఎం ఆదేమ్మ, రెక్కల వెంకటేశ్వర్లు, ఆర్ ఆంజనేయులను , నియమించారు. అలాగే వెలిగండ్ల మండలంలో మండల ఉపాధ్యక్షులుగా ఎలికా నారాయణ, పాపాబత్తుని నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీలుగా గంజి రవీంద్రారెడ్డి, ముప్పూరి బాలకోటయ్య, లింగాల సురేష్, దాదా సోమయ్య, సెక్రటరీలుగా కత్తెరం వెంకటేశ్వరరెడ్డి, తగరం పెద్దయ్య, చిన్న పీరయ్య, తాతపుడి నాని, సర్లు రమణయ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా జక్కుల గుంటయ్య, కేసరి వెంకటరెడ్డి, ఈగిటి వెంకటేశ్వర్లు, నంబుల ఆదయ్య, కొడెతం కేశవరెడ్డి, ముక్కు కృష్ణారెడ్డి, జుటికి పెద్దవరియాన్న గజ్జల నాగిరెడ్డి, రాగిపిండి కృష్ణారెడ్డి, వేమన వెంకటరెడ్డి, చిలకమూరి నాగార్జున రెడ్డి, జన్నిగ శివ, నల్లపు వెంకటేశ్వరరెడ్డి, యర్రం వెంకటరెడ్డి, కాశిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఉండేల చిన్న వెంకటరెడ్డి, బోయళ్ల రామకృష్ణ, నారపరెడ్డి కోటిరెడ్డి మోరా నారాయణరెడ్డిలను నియమించారు. అదే విధంగా పీసీపల్లి మండల ఉపాధ్యక్షులుగా యారవ నరసింహ, భూమిరెడ్డి కొండారెడ్డి, భోగాల మాలకొండ రెడ్డి, మోతుకూరి నరేంద్ర, నల్ల గంగుల శ్రీనివాస్ యాదవ్, సెక్రటరీగా నారపరెడ్డి మారకుండారెడ్డి, చెరుకూరి భాస్కరు, చెన్నుపాటి వెంకట్రావు, కసిరెడ్డి ఓబుల్ రెడ్డి, అంబటి మోహన్‌రెడ్డి, కార్యనిర్వాహన సభ్యులుగా మనం వెంకట్రావు, బండారుకృష్ణ, బొగ్రారెడ్డి బాలకోటయ్య, మచ్చ మాలకొండయ్య, తరిమి రోశయ్య, తోడేటి నాగేశ్వరరావు, ఇరిగినేని హజరత్, ముదిరెడ్డి పెద్దిరెడ్డి, కమ్మ నరసింహం, తిరుమల గుడి మహేష్, ఉప్పుగండ్ల అంకబాబు, బి.నరసారెడ్డి, నల్లి వెంకటరమణయ్య, మూలే నారాయణరెడ్డి, దేవుండ్ల వీరయ్య, కాకునూరి వెంకటేశ్వర్లు, దుద్దుగుంట్ల నాగేశ్వరరెడ్డి, వల్లెం రమణారెడ్డి, ఎర్రగుంట్ల దేవదాసులను నియమించారు.

ఘనంగా మొహర్రం పెద్ద షరిగత్ వేడుకలు



పీర్ల చావిడి వద్ద అగ్ని గుండం



సయ్యద్ మకాన్ వద్ద పూజలందుకుంటున్న అక్బర్‌వలి(గజ్జల పీరు)

కనిగిరిరూరల్: ఇమామే హసన్, ఇమామే హుస్సేన్, ఇమామే ఖాశిం వంశీకుల త్యాగ నిరతికి ప్రతీకగా, మత సామరస్యానికి ప్రతీకగా.. జరుపుకునే మొహర్రం(పీర్ల పండుగ) పెద్ద షరిగత్ వేడుకలను శనివారం రాత్రి కనిగిరిలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కనిగిరి ప్రాంతంలోని వివిధ పీర్ల చావిడీలలో కొలువై ఉన్న పీర్లకు విశిష్ట పూజలు చేశారు. సయ్యద్ మకాన్, మయాన(పఠాన్) మకాన్, మంగలిమాన్యం, దేవాంగ నగర్, శంఖవరం, గురువాజీపేట తదితర పీర్ల చావిళ్ల వద్ద భక్తులు కిటకిటలాడారు. హజరత్‌లకు ఎంతో నియమ నిష్టలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కుల, మత వర్గాల కతీతంగా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా పీర్ల చావిడీలను సుందరంగా అలంకరించారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పీర్ల చావిడిల వద్ద పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేశాయి. అనంతరం పీర్లను పట్టణ పురవీధుల్లో తప్పెట్ల తాళాలతో ఊరేగించారు. అలాగే మండలంలోని గురువాజీ పేట, గానుగపెంట, బడుగులేరు, దిరిశవంచ తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పీర్ల అగ్ని గుండప్రవేశం ఉంటుంది. ఆదివారం తెల్లవారుజామున అన్ని మకాన్‌ల (చావిళ్ల)కు చెందిన పీర్ల సలాంల కార్యక్రమం పట్టణంలోని బొడ్డు చావిడి వద్ద అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి



పామూరు పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలిస్తున్న ఎస్పీ

పామూరు: సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయాన్ని శనివారం సాయంత్రం ఎస్పీ దామోదర్ కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పరిసరాలను పరిశీలించారు. అనంతరం సర్కిల్ పరిధిలోని రికార్డులు పరిశీలించి తరుచూ నమోదవుతున్న కేసులు, ఇతర అంశాలపై పరిశీలించారు. పోలీస్‌సిబ్బంది ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సీసీ కెమెరాలు ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసి భద్రతను పటిష్టం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, పామూరు సీఐ ఎం భీమానాయక్, సిబ్బంది ఉన్నారు.

కనిగిరిరూరల్: కనిగిరి సబ్ డివిజన్ పరిధిలోని చంద్రశేఖరపురం, వెలిగండ్ల, కనిగిరి, హనుమంతునిపాడు పోలీస్‌స్టేషన్లను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. కేసుల దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. మొహర్రం వేడుకలను ప్రశాంతంగా, ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించాలని సూచించారు. డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, పామూరు సీఐ భీమా నాయక్, కనిగిరి సీఐ ఖాజావలి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చెత్త డంప్



బస్టాండ్ ఆవరణలో పేరుకున్న చెత్త

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో చెత్త డంప్ చేయడంతో దుర్గంధం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల వారు బస్టాండు ఆవరణలో చెత్త పోయడంతో పాటు సమీపంలోని బ్రాందీషాపులో మద్యం తాగే వెసులుబాటు ఉండటంతో వారు తాగిన మద్యం గ్లాసులు కూడా తెచ్చి బస్టాండ్ ఆవరణలో వేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నెల క్రితం ఆర్టీసీ ఒంగోలు ఆర్ఎం సత్యనారాయణ బస్టాండ్ పరిశీలనకు వచ్చినప్పుడు ఆవరణలో చెత్త నిల్వలు లేకుండా చూడాలని బస్టాండ్ కంట్రోలర్‌కు సూచించారు. ఈ విషయమై కంట్రోలర్ పంచాయతీ అధికారులకు చెప్పి నెల గడుస్తున్నా బస్టాండ్‌లో చెత్త పేరుకుపోతుందే తప్ప తొలగించే నాథుడు లేడని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలో చెత్త తొలగించి దుర్గంధాన్ని అరికట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రీన్ అంబాసిడర్లుగా తయారు చేయాలి

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరినీ వారి తల్లి పేరుతో మొక్కలు నాటి సంరక్షించి విద్యార్థులను గ్రీన్ అంబాసిడర్లుగా తయారు చేయాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలు మోడల్ ప్రాథమిక పాఠశాలలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా మొక్కల కోసం ఉపాధ్యాయులు ఇండెంట్ పెట్టాలన్నారు. మొక్కలు నాటి సంరక్షించిన విద్యార్థులకు ప్రభుత్వం గ్రీన్ పాస్‌పోర్టులు ఇస్తుందన్నారు. మోడల్ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు.

లోక్ అదాలత్‌తో పెండింగ్ కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

సింగరాయకొండ: పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ ఆదాలత్ మంచి అవకాశమని ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి, ఒంగోలు స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి వి.వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్, న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. జడ్జి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నూతనంగా ప్రారంభమైన ఈ కోర్టులో ఇటీవల కాలంలో వెయ్యి కేసులు పరిష్కారమయ్యాయని, సుమారు 4 వేల పెండింగ్ కేసులు ఉన్నాయన్నారు. చాలా కేసులు ఆవేశంతో పెట్టుకున్నవేనని చెప్పారు. ఇటువంటి చిన్న కేసులు పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగమన్నారు. ఇరుపక్షాల ఆమోదంతోనే కేసులు పరిష్కారమవుతాయని, లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారమైతే మళ్లీ అప్పీల్‌కు అవకాశం లేదని వివరించారు. అంతేగాక ప్రజలకు అవసరమైన న్యాయ సలహాలు ఇచ్చేందుకు త్వరలో న్యాయ సేవాకేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా సుమారు 250 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. వాటిలో 22 ఎక్సైజ్ కేసులు ఉన్నట్లు పేర్కొన్నాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులనాయుడు, లాయర్లు కొల్లూరి నరసింహారావు, బక్కముతుల వెంకటేశ్వర్లు, కందుకూరు మాజీ ఏజీపీ కోటేశ్వరరావు, పోలీసులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

760 కేసుల పరిష్కారం

కనిగిరిరూరల్: కనిగిరి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిలో జాతీయ లోక్ అదాలత్‌లో 543 కేసులు పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి. రూపశ్రీ తెలిపారు. కక్షలు, కార్పణ్యాలకు వెళ్లకుండా రాజీ మార్గంలో వెళ్లి రాజమార్గాన్ని అనుసరించాలన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల వలయంలో అంగన్‌వాడీ కేంద్రం



అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మురుగు



అంగన్‌వాడీ రోడ్డులో పెద్ద పెద్ద రాళ్లు

టంగుటూరు: మండల కేంద్రం టంగుటూరు బుడబుక్కల కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం కోడ్ నంబర్–28549110804 ఉందని అధికారులు, ప్రజాప్రతినిధులు మరచిపోయారు. కరెంట్, రోడ్డు, మంచి నీటి వసతులు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా చీమకుట్టినట్లు కూడా లేదు. ఆ కేంద్రం ఆవరణలో మురుగు తిష్ట వేసి ఉంది. కరెంటు లేక విద్యార్థులు ఎండలకు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం దారిలో ఎవరో పెద్ద పెద్ద రాళ్లు తోలడంతో ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు లేక మంచి నీటి సరఫరా ఆగిపోవడంతో మరుగుదొడ్ల వాడుకకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించక పోవడంతో ఉపాధ్యాయిని సొంత నిధులు రూ.15 వేలతో కరెంటు వైర్లు, ఫ్యాన్లు, తదితర సామగ్రి సమకూర్చుకున్నారు. ఎవరో ఆకతాయిలు కరెంటు వైర్లు కత్తిరించడంతో కరెంటు సరఫరా నిలిచిపోయిందని, అధికారులకు తెలిపినా ఫలితం శూన్యం. అసలకే ఎండలు, ఉక్కపోతతో పిల్లలు అల్లాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించాలి

- డీపీఓ గొట్టిపాటి వెంకట నాయుడు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీఓ వెంకటనాయుడు

మద్దిపాడు: మండలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అధ్వానంగా ఉన్నాయని, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని డీపీఓ గొట్టిపాటి వెంకటనాయుడు అన్నారు. శనివారం మండలంలోని తంగెళ్లలో చెత్త సేకరణ కాల్స్, పారిశుధ్యాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సంపద తయారీ కేంద్రాల వద్దకు తరలించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లోకి చెత్తబండ్లు వెళ్తున్నాయా? లేదా? ఎప్పటి కప్పుడు వాకబ్ చేయాలన్నారు. రోజూ చెత్తబండ్లు గ్రామంలోకి వెళ్లాలన్నారు. గ్రామాల్లో తిరిగి అవగాహన చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, పారిశుధ్యం మెరుగు పడాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ ఎస్కే నాగూర్‌వలి, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ సుధీర్ ఉన్నారు.

పొగాకును అక్రమంగా కొనుగోళ్లు చేయవద్దు



వేలం నిర్వహిస్తున్న సునీల్‌కుమార్

టంగుటూరు: పొగాకును అక్రమ కొనుగోళ్లు, అమ్మకాలు చేయవద్దని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఎక్కడైనా అక్రమంగా పొగాకు బేళ్లు తరలిస్తుంటే బోర్డు వారికి సమాచారం ఇవ్వాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు కోరారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో టంగుటూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు, సాధువారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 952 బేళ్లను తీసుకొచ్చారు. వాటిలో 798 కొనుగోలు చేయగా 154 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరిస్కరించారు. గరిష్ఠ ధర రూ.280 కాగా, కనిష్ఠ ధర రూ.160 పలికింది. సరాసరి రూ.215.43 ధర పలికింది. వేలంలో మొత్తం 25 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

237 పొగాకు బేళ్ల తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 237 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కట్టవారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 872 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 635 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 237 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ఠ ధర కేజీ రూ.280, కనిష్ఠ ధర కేజీ రూ.160, సరాసరి ధర కేజీ రూ.228.45 గా నమోదైంది. వేలంలో 19 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు. వేలాన్ని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య పరిశీలించారు.